సాక్షి తూర్పుగోదావరి

బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి గరికపాటి నమశ్శివాయ (కాకినాడ) మంగళవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

SAKSHI PREMIER LEAGUE

ధనాధన్ విన్నర్స్ ఐడియల్, శ్రీప్రకాష్

ఆటల్లో గెలుపు ఓటముల కన్నా క్రీడాస్ఫూర్తి ప్రధానం అని, అది అలవర్చుకుని నిజ జీవితంలో కూడా రాణించాలని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు పేర్కొన్నారు. 10లో..

డెల్టాలకు 6,895 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 6,895 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.40 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

గంజాయిపై రైల్వే పోలీసుల సోదాలు



ప్రయాణికుల బ్యాగ్‌లు తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు రైల్వే స్టేషన్‌తో పాటు ప్రయాణికుల సామగ్రిని పూర్తి స్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయశంకర్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ రైల్వే ఎస్పీ విశాల్ గున్ని ఆదేశాల మేరకు.. రాజమహేంద్రవరం డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యాన మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ రూములు, పార్సిల్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ప్రయాణికుల లగేజీని సైతం తనిఖీ చేశారు. గంజాయి స్పెషల్ డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందని విజయశంకర్ చెప్పారు. జీఆర్పీ ఎస్సై మావుళ్లు, ఏఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

మేరీమాత ఉత్సవాలకు తాత్కాలిక హాల్టులు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడ సమీపంలోని గుణదల మేరీమాత ఉత్సవాల సందర్భంగా ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ పలు రైళ్లను గుణదల, రామవరప్పాడు స్టేషన్లలో తాత్కాలికంగా నిలపనున్నారు. రైల్వే అధికారులు మంగళవారం ఈ విషయం తెలిపారు. తిరుపతి – కాకినాడ్ టౌన్ – తిరుపతి (17249/17250), విజయవాడ – కాకినాడ పోర్ట్ – విజయవాడ (17257/17258), విజయవాడ – రాజమహేంద్రవరం – విజయవాడ(07768/07767) రైళ్లు ఆ స్టేషన్లలో ఆగుతాయని వివరించారు.

అమ్మవారికి 2 కేజీల బంగారు చీర



బంగారంతో తయారు చేయించిన చీర

పెదపూడి: జి.మామిడాడ శివారు ఎల్ఎన్ పురంలోని శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వారి ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారికి 2 కేజీల బంగారంతో తయారు చేయించిన చీరను బుధవారం అలంకరించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో మంగళవారం 108 మంది కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు, దాతలు అందించిన విరాళాలతో ఈ బంగారు చీర తయారు చేయించారు.

గుడ్డుపై కమింగ్ పిడుగు

- కోళ్ల రైతుల ఆశలు ఆవిరి
- పతనమవుతున్న ధర
- పౌల్ట్రీని సంక్షోభంలోకి నెట్టేస్తున్న కమింగ్ రేటు
- రెండు వారాల్లో రైతు ధర రూ.1.25 పతనం

మండపేట: సీజన్‌లో పాత నష్టాలు గట్టెక్కిస్తుందనుకున్న గుడ్డు రైతు ధర అంతలోనే ఆవిరైంది. రెండు వారాల వ్యవధిలో రూ.1.25 పతనమై కోళ్ల రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. మరోపక్క మేత ధరలు పెరిగిపోతుండగా రానున్న వేసవితో పరిశ్రమకు గడ్డుకాలం తప్పదని పౌల్ట్రీవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కమింగ్ పేరిట దళారుల దోపిడీ రైతుధర పతనానికి కారణమని వారంటున్నారు.

కమింగ్ రేటు పేరిట దళారుల దోపిడీ

రైతు ధర ఆశాజనకంగా ఉన్న తరుణంలో తణుకు, కోల్‌కతా, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని కొందరు దళారులు కుమ్మక్కై కమింగ్ రేటు పేరిట దోపిడీకి తెరలేపారని పౌల్ట్రీవర్గాలంటున్నాయి. ఎగుమతుల డిమాండ్‌ను బట్టి ఒక రోజుకు లేదా రెండు మూడు రోజులకు, ఒక్కోసారి వారం పదిరోజులకు నెక్ రేటు మారుతుంటుంది. సాధారణంగా ఏ రోజు గుడ్లు ఎగుమతి చేస్తే ఆ రోజు ఉన్న ధరను వ్యాపారులు కోళ్ల రైతుకి చెల్లించాలి. అయితే గుడ్ల మార్కెట్‌ను గుప్పెట్లో పెట్టుకున్న వ్యాపారులు సిండికేటై ఎగుమతులకు డిమాండ్ లేదని, కమింగ్ రేటు (ప్రస్తుతం ఉన్న ధర కాకుండా తర్వాత వచ్చే నెక్ ధరకు గుడ్లు కొనుగోలు చేస్తారు. నెక్ రేటు తగ్గితే ఎన్నిరోజులు అయితే అన్ని రోజులకు తగ్గిన ధరను చెల్లిస్తారు) సంప్రదాయానికి తెర లేపారంటున్నారు. ఈ క్రమంలోనే గత నెలలో ఆశాజనకంగా ఉన్న ధర ఒక్కసారిగా పతనమైందని కోళ్ల రైతులు అంటున్నారు. ధర మరింత తగ్గిపోతుందన్న ఆందోళనలో కోళ్ల రైతులు కమింగ్ రేటుకు తలొగ్గుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని దళారులు లాభాలకు అమ్ముకుని కోళ్ల రైతులకు తగ్గిన రేటును చెల్లిస్తున్నారు. కమింగ్ రేటు పేరిట దళారుల దోపిడీని అరికట్టేందుకు ఏపీ పౌల్ట్రీ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కర్రి వెంకట ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, అసోసియేషన్ నాయకులు చర్యలు చేపట్టారు. నాలుగు రోజుల క్రితం మూడు జిల్లాల కోళ్ల రైతులు సమావేశమై సమస్యపై చర్చించారు. దళారుల దోపిడీని నిరసిస్తూ దేవరపల్లి హైవే జంక్షన్ వద్ద పౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వ్యయప్రయాసలకోర్చి పౌల్ట్రీలు నిర్వహిస్తుంటే కమింగ్ పేరిట తమ కష్టాన్ని దళారులు దోచుకుంటున్నారని వారు మండిపడుతున్నారు.

ఊహించని విధంగా తగ్గిన ధర

శీతల ప్రభావం, విదేశాలకు గుడ్ల ఎగుమతులు నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పశ్చిమబెంగాల్, ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు పెరిగి గత నెలలో రైతు ధర పుంజుకుంటూ వచ్చింది. జనవరి 19న రూ.5.67కు చేరి పౌల్ట్రీ చరిత్రలో అత్యధిక రైతు ధరను నమోదు చేసుకుంది. ఎగుమతులకు డిమాండ్ ఉండటంతో మరికొంతకాలం పాటు రైతు ధర తగ్గకుండా నిలకడగా ఉంటుందని పౌల్ట్రీ వర్గాలు భావించాయి. మేత ధరలు, తెగుళ్ల బెడద, నిర్వహణ వ్యయంతో గుడ్డు ధర గిట్టుబాటవ్వక గత కొన్నేళ్లుగా పరిశ్రమను వెంటాడుతున్న పాత నష్టాలు ప్రస్తుత ధరతో కొంత మేర భర్తీ అవుతాయని ఆశించారు. ఊహించని విధంగా ధర తగ్గుముఖం పట్టి రెండు వారాల వ్యవధిలోనే రూ.1.25 పతనమై ప్రస్తుతం రైతు ధర రూ.4.42కు చేరుకుంది.



పౌల్ట్రీలో కోళ్లకు దాణా వేస్తున్న కార్మికులు (ఫైల్)

ముందున్న వేసవితో మరిన్ని కష్టాలు

ఇప్పటికే గుడ్డు ధర పతనం, మేత ధరలు దిగిరాక దిక్కుతోచని స్థితిలో ఉన్న కోళ్ల రైతులకు ముందున్న వేసవి మరింత గుబులు పుట్టిస్తోంది. ఉష్ణోగ్రతలు పెరిగే కొద్ది గుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు కోళ్ల మరణాలు పెరిగి పౌల్ట్రీ పరిశ్రమకు నష్టాలు వాటిల్లుతుంటాయి. పెరిగిన మేతలు, మందుల ధరలు, నిర్వహణ భారంతో గుడ్డు రైతు ధర ఐదు రూపాయలు ఉంటేనేగాని గిట్టుబాటు కాదని కోళ్ల రైతులు అంటున్నారు. ప్రస్తుతం రైతు ధర రూ.4.42కు పతనం కాగా ఆ మేరకు పరిశ్రమకు నష్టం వాటిల్లుతోంది. త్వరలో వేసవి మొదలుకానుండటంతో ధర మరింత పతనం కానుండగా, కోళ్ల మరణాలతో మున్ముందు గడ్డుకాలం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



దారుణంగా దోచేస్తున్నారు

కోళ్ల రైతుల కష్టాన్ని కమింగ్ రేటు పేరిట దళారులు దారుణంగా దోచేస్తున్నారు. దళారులు కుమ్మక్కై ఒక్కసారిగా ధరను తగ్గించేశారు. ఏం చేయాలో పాలుపోని దుస్థితిలో కోళ్ల రైతులు ఉన్నారు. పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– పడాల సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, అర్తమూరు

ఆరోగ్యకర జీవన శైలి అలవరచుకోవాలి

- క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- హోం మంత్రి తానేటి వనిత
- రాజమహేంద్రవరంలో 2కే రన్



క్యాన్సర్ ర్యాలీలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత



ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులో ఐఎంఏ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన శైలి అలవరచుకుని, క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని, ఈ వ్యాధిని పూర్తిగా తరిమివేయాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్ వరకూ డెల్టా ఆసుపత్రి ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన 2కే రన్‌ను కలెక్టర్ కె.మాధవీలతతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రోజూ ఉదయం పూట క్రమపద్ధతిలో వ్యాయామం చేయడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి, ఆరోగ్యవంతంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఎక్కువగా మహిళల్లో బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్‌ను గుర్తిస్తున్నారని చెప్పారు. మంచి అలవాట్లతో క్యాన్సర్ రాకుండా నివారించడం సాధ్యమేనని, అయితే వంశ పారంపర్యంగా వచ్చే వారి విషయంలో మనోధైర్యంతో ఉండాలని అన్నారు. సరైన సమయంలో గుర్తించగలిగితే క్యాన్సర్‌కు చికిత్స సాధ్యమవుతుందని చెప్పారు. జంక్ ఫుడ్స్ తినడం మానాలని మంత్రి సూచించారు. కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ, క్యాన్సర్‌ను ముందస్తుగా ఏవిధంగా గుర్తించాలి, అందుకు ఎటువంటి పరీక్షలు చేసుకోవాలనే అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పురుషుల్లో కంటే మహిళల్లో క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారన్నారు. కార్యక్రమంలో డెల్టా ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ఆర్.భాస్కర చౌదరి, వైద్యులు బొమ్మిరెడ్డి శ్రీనివాస్, నితిన్, సుమంత్, ఫణీంద్ర, గీతా శ్రవణ్, రాజ్యలక్ష్మి, హరికిషన్, రవి కుమార్, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యాన ఉచిత స్క్రీనింగ్ క్యాంప్

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యాన జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును కలెక్టర్ మాధవీలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సరైన అవగాహన లేనందువలన తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తించలేకపోతున్నామని, ఈ వ్యాధిని ముందస్తుగా గుర్తించే అవకాశం నేడు అందుబాటులోకి వచ్చిందని అన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రుల ఆధ్వర్యాన ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తద్వారా క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ద్వారా సరైన సమయంలో చికిత్స పొందడం సాధ్యమవుతుందని చెప్పారు. ఎక్కువ మంది మగవారు ప్రొస్టేట్ క్యాన్సర్ బారిన పడుతూండగా, మహిళల్లో ఛాతి, గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా గుర్తిస్తున్నారని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ నిర్ధారణకు శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వాసుపత్రులతో పాటు టీచింగ్ ఆసుపత్రుల్లో కూడా క్యాన్సర్‌కు చికిత్స అందిస్తున్నారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం ద్వారా క్యాన్సర్‌ను ఎదుర్కోవడం సాధ్యమవుతుందని అన్నారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించే అవకాశం ఉన్న సందర్భాల్లో ఎటువంటి సంకోచం లేకుండా తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గురుప్రసాద్, డాక్టర్ పద్మలత, జీఎస్ఎల్ ఆసుపత్రి క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ విశ్వనాథ్, డెల్టా ఆసుపత్రి ఆంకాలజిస్ట్ డాక్టర్ స్ఫూర్తి, జిల్లా ఆసుపత్రి డీఎంఓ డాక్టర్ ఆనంద్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

10న రాజానగరంలో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం బర్ల సుబ్బలక్ష్మి డిగ్రీ కాలేజీలో (దివ్య విద్యా సంస్థలు) శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.మాధవీలత మంగళవారం తెలిపారు. సుమారు 14 కంపెనీల్లో 800 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. సమీర్ ఆగ్రో ఇండస్ట్రీస్, ఐడీఈఎఫ్, నిట్ (ఐసీఐసీఐ బ్యాంక్), ఇండిగో ఎయిర్‌లైన్స్, కోజెంట్ ఈ–సర్వీసెస్, డెక్కన్ కెమికల్స్, ఏపీ టైర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ, హోండాయ్ మోబిస్, ఎస్‌వీహెచ్, ఇసుజు మోటార్స్ లిమిటెడ్, హెల్ప్ యువర్ నీడ్స్.కామ్ తదితర కంపెనీల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. 5వ తరగతి నుంచి టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఏఎన్ఎం, జీఎన్ఎం, ఏపీహెచ్‌డబ్ల్యూ, బీఎస్సీ, నర్సింగ్ ఉత్తీర్ణులైన 45 ఏళ్ల లోపు అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలను వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ జీతం, ఇన్సెంటివ్‌లు, భోజన, వసతి, రవాణా సౌకర్యాలు బట్టి ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆ రోజు ఉదయం 9 గంటలకు దివ్య విద్యా సంస్థల వద్ద సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 99481 42036, 94936 25456, www.vikasajobs.comలో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

ఆరోగ్యశ్రీలో డబ్బులు వసూలు చేస్తే చర్యలు

- పునరావృతమైతే ఆసుపత్రి లైసెన్సు రద్దు
- కలెక్టర్ మాధవీలత హెచ్చరిక

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అందించే వైద్య సేవలకు డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని, పునరావృతమైతే ఆసుపత్రి లైసెన్సు రద్దు చేస్తామని కలెక్టర్ కె.మాధవీలత హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ పథకం అమలుపై జిల్లా స్థాయి క్రమశిక్షణ కమిటీ తొలి సమావేశాన్ని తన చాంబర్‌లో మంగళవారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్రజలకు వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం, నగదు వసూలు, సేవల్లో లోపాలు, స్కానింగ్ ఫీజ్ వసూలు, రోగిని చేర్చుకోవడానికి తిరస్కరించడం వంటి అనేక ఫిర్యాదులు ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వానికి వచ్చాయని తెలిపారు. 47 సచివాలయాల పరిధిలో మొత్తం 202 ఫిర్యాదులు నమోదయ్యాయన్నారు. జిల్లావ్యాప్తంగా 48 ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించి 105, రిజిస్ట్రేషన్ సంబంధించి 48, ఇతరాలు 49 చొప్పున ఫిర్యాదులు నమోదయ్యాయని చెప్పారు. ఫిర్యాదు చేసిన ఒక వ్యక్తితో ఫోనులో మాట్లాడుతూ, సమగ్ర సమాచారం అందిస్తే ఆయా ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వైద్య సేవల విషయంలో ఆసుపత్రుల ఉద్దేశపూర్వకంగా తప్పు చేసినట్లయితే భారీ జరిమానా విధిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. అకీరా, అంజనా వైద్యశాల, అన్నపూర్ణ, ఎసెంట్, స్వతంత్ర, చక్రధర్, డెల్టా, అరవింద్, గౌతమి, సిద్ధార్థ, జీఎస్ఎల్, కిమ్స్, రేవతి, జిల్లా ఆసుపత్రి, రాయల్, సాయి, శ్రీలత, ప్రశాంతి, తదితర 48 ఆసుపత్రుల నుంచి ఫిర్యాదుల వారీగా వివరణ తీసుకున్నామన్నారు. కొన్ని ఫిర్యాదులకు సంబంధించి జరిమానా విధించామని, ఇదే తీరు పునరావృతమైతే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్వెస్టిగేషన్, మందులు, ఓపీ కార్డ్, వైద్య సేవలకు నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులందాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలు పొందే వారితో ఆరోగ్యమిత్రలు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. నగదు వసూలు ఫిర్యాదులకు సంబంధించి ఆయా రోగులు, ఆరోగ్య మిత్రలను కూడా పిలిపించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగికి ఆరోగ్య శ్రీ పథకం ఉందా, తెల్ల రేషన్ కార్డు ఉందా తెలుసుకు ని అవగాహన కల్పించే బాధ్యత ఆయా ఆసుపత్రులదేనని మాధవీలత తెలిపారు. ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.సనత్ కుమారి పాల్గొన్నారు.

10న వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా విడుదల

జిల్లాలో 156 మంది అర్హులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకంలో జిల్లావ్యాప్తంగా తొలి విడత 156 మందిని అర్హులుగా గుర్తించినట్లు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. వైఎస్సార్ కల్యాణమస్తు పథకంపై తన చాంబర్‌లో మంగళవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమరావతి నుంచి వర్చువల్ విధానంలో ఈ నెల 10న లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు బదిలీ చేస్తారని చెప్పారు. రంగంపేట 2, రాజానగరం 4, గోకవరం 4, నల్లజర్ల 4, కోరుకొండ 4, తాళ్లపూడి 4, సీతానగరం 5, కొవ్వూరు అర్బన్ 5, బిక్కవోలు 5, అనపర్తి 6, కడియం 7, దేవరపల్లి 7, నిడదవోలు అర్బన్ 7, కొవ్వూరు 8, నిడదవోలు 8, రాజమహేంద్రవరం 9, గోపాలపురం 11, రాజమహేంద్రవరం అర్బన్ 13, చాగల్లు 14, ఉండ్రాజవరం 14, పెరవలి 15 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశామని వివరించారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష ఎస్సీ, ఎస్టీలు కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, బీసీలు కులాంతర వివాహం చేసుకుంటే రూ.75 వేలు, దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సభ్యులకు రూ.50 వేల చొప్పున చెల్లిస్తారని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సుభాషిణి, డీఎల్‌పీఓలు పి.వీణాదేవి, వి.శాంతమణి పాల్గొన్నారు.

అపరిశుభ్రతను నివారిస్తేనే వ్యాధులు దూరం



వెంకటనగరంలో నాఫెడ్ పిట్‌లను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లో అపరిశుభ్రతను నివారిస్తేనే వ్యాధులు దూరం అవుతాయని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. వెంకట నగరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో జగనన్న స్వచ్ఛసంకల్పంపై మంగళవారం అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లోని ఒక్కో వీధిని దత్తత తీసుకుని తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలోని 300 పంచాయతీల్లో 270 షెడ్ల నిర్మాణం పూర్తి కాగా, 219 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మి కంపోస్టు తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారని చెప్పారు. తద్వారా గ్రామ పంచాయతీలకు అదనంగా ఆదాయం సమకూరుతుందన్నారు. రాజమహేంద్రవరం డీఎల్‌పీఓ జె.సత్యనారాయణ, రూరల్ ఎంపీడీఓ కె.రత్నకుమారి మాట్లాడుతూ, వెంకటనగరం, బొమ్మూరు, ఐ.పంగిడి సంపద తయారీ కేంద్రాల్లో స్థానిక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం జిల్లా కో ఆర్డినేటర్ కె.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఆధ్వర్యాన చెత్త నుంచి సంపద తయారు చేసే విధానాన్ని డీపీఆర్‌సీ బృందం క్షుణ్ణంగా వివరించింది.

ఫారెస్టు అకాడమీ అభివృద్ధికి చర్యలు



బోర్డు ఆఫ్ కంట్రోల్ సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనరెడ్డి

రాజానగరం: ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ప్రధాన అటవీ సంరక్షణాధికారి, అటవీ దళాధిపతి వై.మధుసూదనరెడ్డి తెలిపారు. దివాన్‌చెరువులోని అకాడమీ కార్యాలయంలో మంగళవారం జరిగిన అకాడమీ బోర్డు ఆఫ్ కంట్రోల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగుల దైనందిన విధి నిర్వహణకు అనుగుణంగా అకాడమీ సిలబస్‌లో చేస్తున్న మార్పులను డైరెక్టర్ ఉదయ్ భాస్కర్ వివరించారు. మధుసూదనరెడ్డి మాట్లాడుతూ, అకాడమీ ఆర్థిక స్వయం పరిపుష్టికి ఉన్న అవకాశాలను అన్వేషించాలన్నారు. సిబ్బంది శిక్షణ వనరులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. అనంతరం జరిగిన ఫారెస్టు సొసైటీ బోర్డు ఆఫ్ గవర్నర్ సమావేశంలో సొసైటీని మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దే వివిధ ప్రణాళికలపై చర్చించారు. కలప, వృక్షాలను సాగు చేసే రైతులకు సంరక్షణ, మార్కెటింగ్ పరంగా సహకరించడం, ఎకో టూరిజం అభివృద్ధి ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం, పెద్ద ఎత్తున శిక్షణ కార్యక్రమాల నిర్వహణ ద్వారా సొసైటీని బలోపేతం చేసే ప్రణాళికలపై చర్చించారు. కార్యక్రమంలో స్పెషల్ సెక్రటరీ డాక్టర్ పీవీ చలపతిరావు, ఆర్‌కే సుమన్, రాజమహేంద్రవరం సర్కిల్ అటవీ సంరక్షణాధికారి ఎస్.శ్రీశరవణన్, స్టేట్ సిల్వికల్చరిస్టు షేక్ సలాం, జిల్లా అటవీ అధికారి బి.నాగరాజు, అకాడమీ ఏసీఎఫ్‌లు డాక్టర్ ఎన్‌వీ శివరాంప్రసాద్, టి.చక్రపాణి, టి.శ్రీనివాసరావు, వి.శ్రీహరిగోపాల్, ఏవీ రమణమూర్తి, సూపరింటెండెంట్ జె.దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15 వరకు నవోదయ ప్రవేశ దరఖాస్తుకు గడువు పెంపు

రాయవరం: జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల గడువును పొడిగించారు. ఆరవ తరగతిలో ప్రవేశానికి తొలుత తుది గడువుగా జనవరి 31గా నిర్ణయించారు. ఈ గడువును ఫిబ్రవరి 8వ తేదీ వరకు పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో తల్లిదండ్రుల నుంచి గడువు పెంచాలని వినతులు రావడంతో నవోదయ విద్యాలయ సమితి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కోనసీమ జిల్లాలో గతేడాది 4,882 దరఖాస్తులు రాగా ఇప్పటికి 2,442, మాత్రమే వచ్చాయి.

వైనాట్‌కు బ్లూస్టార్ గోల్డెన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వైనాట్ అధినేత రాయుడు

తణుకు: పట్టణానికి చెందిన వైనాట్ షాపింగ్ మాల్‌కు ప్రముఖ ఏసీ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ గోల్డెన్ అవార్డు దక్కింది. చెన్నై లీలా ప్యాలెస్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వైనాట్ గ్రూప్ సంస్థల అధినేత జుజ్జువరపు వెంకటరాయుడుకి బ్లూస్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్, అధ్యక్షులు శశి అరోరా చేతుల మీదుగా అవార్డు అందజేశారు. దక్షిణ భారత దేశంలోని ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో చైన్ స్టోర్ డివిజన్‌లో పవర్ రిటైలర్ విభాగంలో ఈ అవార్డు దక్కిందన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు. సిబ్బందికి రాయుడు అభినందనలు తెలిపారు.

ధనాధన్ విన్నర్స్ ఐడియల్, శ్రీప్రకాష్

- అట్టహాసంగా ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు
- రన్నర్స్‌గా జీబీఆర్, గైట్ పాలిటెక్నిక్



సీనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన కాకినాడ ఐడియల్ కళాశాల జట్టు కెప్టెన్‌కు షీల్డు అందజేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



జూనియర్స్ విభాగంలో విజేత పెద్దాపురం శ్రీప్రకాష్ జట్టు కెప్టెన్‌కు ట్రోఫీ అందజేస్తున్న స్పాన్సరర్ హరీష్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆటల్లో గెలుపు ఓటముల కన్నా క్రీడాస్ఫూర్తి ప్రధానం అని, అది అలవర్చుకుని నిజ జీవితంలో కూడా రాణించాలని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు పేర్కొన్నారు. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఎనిమిది రోజులుగా కాకినాడ, రాజమహేంద్రవరంలో జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ ధనాధన్ క్రికెట్ పోటీల ముగింపు ఉత్సవం స్థానిక ఆర్ఎంసీ క్రీడామైదానంలో నిర్వహించారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు షీల్డ్స్ అందజేశారు. గౌరవ అతిథులుగా టోర్నమెంట్ రిఫ్రెష్‌మెంట్ స్పాన్సరర్, హరీష్ స్పోర్ట్స్ అధినేత టి.హరీష్, జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి సత్యనారాయణ హాజరయ్యారు. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో నిర్వహించిన ఈ పోటీలలో రాజమహేంద్రవరం, కాకినాడలో మ్యాచ్‌లు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 40 జట్లు పాల్గొన్నాయి. వరుసగా నాలుగో ఏడాది ఈ పోటీలను 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ పోటీలలోని సీనియర్స్, జూనియర్స్ విభాగంలో విజేత జట్లు విశాఖలో జరిగే అంతర్ జిల్లాల సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో పాల్గొంటాయి.

స్పోర్టివ్‌గా ముందుకు వెళ్లాలి : ఎస్పీ

ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ క్రీడాపోటీల నిర్వాహకులు, స్పాన్సరర్స్, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. టీం స్పిరిట్‌తో పాటు 11 మంది సహకారంతో ఆడితేనే గెలుపు వస్తుందన్నారు. ఇది నిజ జీవితంలో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. చిన్న విషయాలకే డిప్రెషన్‌కు గురికాకుండా ప్రతీది స్పోర్టివ్‌గా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. టోర్నమెంట్ రిఫ్రెష్‌మెంట్ స్పాన్సరర్, హరీష్ స్పోర్ట్స్ అధినేత టి.హరీష్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి పి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిభగల క్రీడాకారులకు ప్రస్తుత రోజుల్లో అవకాశాలకు కొదవ లేదన్నారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఇటువంటి క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ముఖ్యఅతిథి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు సీనియర్స్ విజేత కాకినాడ ఐడియల్ కళాశాల జట్టుకు, రన్నర్స్‌గా నిలిచిన అనపర్తి జీబీఆర్ కళాశాల జట్టు కెప్టెన్‌లకు షీల్డ్‌లను, సర్టిఫికెట్లను అందజేశారు. జూనియర్స్ విజేత పెద్దాపురం శ్రీప్రకాష్ స్కూల్స్‌కు టోర్నమెంట్ రిఫ్రెష్‌మెంట్ స్పాన్సరర్ హరీష్, రన్నర్స్‌గా నిలిచిన గైట్ పాలిటెక్నిక్ జట్టుకు జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి పి.సత్యనారాయణ షీల్డ్స్‌ను ఇచ్చారు. ఆర్ఎంసీ పీడీ స్వర్ణస్‌రాజు పర్యవేక్షణలో క్రికెట్ లీగ్ పోటీలు విజయవంతంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జి ఎల్.శ్రీనివాసరావు, సాక్షి సీనియర్ యాడ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, క్రికెట్ కోచ్ చార్లి, క్రీడాకారులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు

సీనియర్స్ విభాగంలో నిర్వహించిన ఫైనల్స్‌లో ఐడియల్ (కాకినాడ), జీబీఆర్ (అనపర్తి) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన జీబీఆర్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన ఐడియల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 79 పరుగులు చేసింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ సూర్యచైతన్య 35, రవికిరణ్ 22 పరుగులు సాధించారు. జీబీఆర్ జట్టులోని బౌలరు శివ 3 వికెట్లు పడగొట్టాడు. 80 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన జీబీఆర్ జట్టు నిర్ణీత ఓవర్లలో 75 పరుగులు చేసింది. 5 పరుగుల తేడాతో ఐడియల్ జట్టు విజయం సాధించి సీనియర్స్ విభాగంలో కప్ అందుకుంది. రన్నర్స్‌గా జీబీఆర్ జట్టు నిలిచింది.

జూనియర్స్ విభాగంలో నిర్వహించిన మ్యాచ్‌లో శ్రీప్రకాష్ (పెద్దాపురం), గైట్ (రాజమహేంద్రవరం) పాలిటెక్నిక్ జట్లు పోటీ పడ్డాయి. గైట్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ తీసుకుంది. మొదటి బ్యాటింగ్ చేసిన శ్రీప్రకాష్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 135 పరుగులు చేసింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ యశస్వి 32, దిలీప్ 25, చరణ్ 28, హార్దిక్ 22 పరుగులు చేశారు. గైట్ జట్టులోని బౌలర్ మురళి 2 వికెట్లు తీసుకున్నాడు. 136 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన గైట్ జట్టు నిర్ణీత ఓవర్లలో 83 పరుగులు మాత్రమే చేసి 4 వికెట్లు కోల్పోయింది. 52 పరుగుల తేడాతో శ్రీప్రకాష్ జట్టు విజయం సాధించి జూనియర్స్ విభాగంలో కప్‌ను సొంతం చేసుకుంది. రన్నర్స్‌గా గైట్ పాలిటెక్నిక్ జట్టు నిలిచింది.



సీనియర్స్ విభాగంలో రన్నర్‌గా నిలిచిన అనపర్తి జీబీఆర్ జట్టు కెప్టెన్‌కు షీల్డ్ అందజేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



జూనియర్స్ విభాగంలో రన్నర్‌గా నిలిచిన గైట్ కళాశాల జట్టు కెప్టెన్‌కు ట్రోఫీ అందజేస్తున్న, క్రికెట్ సంఘ కార్యదర్శి సత్యనారాయణ

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

ఆలస్యంగా కేసు నమోదు చేసిన పోలీసులు

సామర్లకోట: మానసిక దివ్యాంగురాలిపై జాలి పడవలసి ఉండగా అటువంటి బాలికపై లైంగికదాడి చేసిన ఘటన వేట్లపాలెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అభం శుభం తెలియని ఆమెపై అదే గ్రామానికి చెందిన లక్కిరెడ్డి అప్పన్న అత్యాచారానికి పాల్పడ్డాడు. గర్భవతిగా ఉన్న దివ్యాంగ కుమార్తెలో వస్తున్న మార్పులను గమనించిన ఆమె తల్లి జరిగిన విషయం తెలుసుకొంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన కుమార్తెకు మాయమాటలు చెప్పి మోసం చేశాడని తల్లి పందురి అనంతలక్ష్మి రోదిస్తోంది. ఈ విషయంపై 10 రోజుల క్రితం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా పోలీసులు చర్యలు తీసుకొనకపోవడంతో మంగళవారం తన కుమార్తెతో పోలీసు స్టేషన్‌కు వచ్చింది. దాంతో పోలీసుల్లో కదలిక వచ్చి కేసు నమోదు చేయడానికి హామీ ఇచ్చారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. తల్లి పందురి అనంతలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై టి.సునీత దర్యాప్తు చేస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో తిరుమల ప్రభంజనం



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: జేఈఈ మెయిన్స్ ఫలితాలలో తమ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. కె.వివేక్‌వర్ధన్ 99.999 పర్సంటైల్‌ను సాధించి ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. కేజీ ధనశ్రీ 99.91, ఆర్.అఖిల్ 99.89, ఎల్‌డీ వర్ధన్ 99.89, వీఎస్ఎస్ తేజశ్విని 99.89, ఎంసీహెచ్ అపరాజిత్ 99.86, సీహెచ్.సింజని 99.85, సీహెచ్.రాజీవ్‌లోచన్ 99.85, జీవీఎస్‌జీఎస్ వర్షిత్ 99.83, పి.సునీత 99.83, ఆర్.శివప్రాజిత్ 99.82 పర్సంటైల్‌ను సాధించారన్నారు. 99.5 పర్సంటైల్ పైన 35మంది, 99 పైన 66మంది, 98.5 పైన 98మంది, 98 పైన 129మంది, 97 పైన 188మంది, 96 పైన 246మంది, 95 పైన 288మంది, 90 పర్సంటైల్ పైన 478 మంది సాధించారని తెలియజేశారు. సుమారు 510పైన విద్యార్థులు ఎన్ఐటీ లేదా ఐఐఐటీలలో సీట్లు సాధించగలరని ఆయన తెలిపారు. అత్యుత్తమ స్కోర్‌లను సాధించిన విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

సత్తా చాటిన ఆదిత్య విద్యార్థులు



ఎంఎస్ఎస్ కార్తీక్ ప్రణవ్



ఆర్.అశోక్‌చంద్ర



కె.తేజశ్విని

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఈఈ-మెయిన్స్-2023 ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మంగళవారం తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు 32 మంది 99.00 పర్సంటైల్‌కు పైన సాధించి ఘనత చాటారన్నారు. ఎంఎస్ఎస్ కార్తిక్ ప్రణవ్ 99.94, ఆర్.అశోక్‌చంద్ర 99.94, కె.తేజశ్విని 99.88, వీఆర్.శివతేజ 99.88, బి.భవిత 99.87, కె.వినయ్ 99.85, ఎల్.లిఖిత 99.83, పి.కార్తికేయ 99.83 పర్సంటైల్ సాధించారన్నారు. విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి దీపక్‌రెడ్డి, హాస్టల్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, కో-ఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్ అభినందించారు.

శశి వేలివెన్ను విజయదుందుభి



డీబీ అక్షయ్



ఆర్‌వీ శ్రీరామ వరుణ్



సీహెచ్ వెంకట సాయి



జీవీ సత్యకృష్ణ



జె.నాగేంద్రకుమార్

ఉండ్రాజవరం : జేఈఈ మెయిన్-2023 ఫలితాలల్లో తమ విద్యార్థులు మరోసారి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారని వేలివెన్ను శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. డీబీ అక్షయ్ 99.80, ఆర్‌వీ శ్రీరామ వరుణ్ 99.79, సీహెచ్.వెంకటసాయి 99.77, జీవీ సత్యకృష్ణ 99.73, జె.నాగేంద్రకుమార్ 99.69, బీవీ విక్షిత్ 99.67, పి.గంగామనోహర్ 99.66, జి.మోక్షజ్ఞ 99.62, ఎం.ఉమామహేశ్వరరావు 99.61, కె.రోహిత్‌కుమార్ 99.52, పి.జయచరణ్ 99.46, ఎన్.లక్ష్మీ ప్రవల్లిక 99.45, టి.మోహిత్ చౌదరి 99.42, ఎం.మోహన్ సాయిరామ్ 99.41, డీఈఎస్.ఆదర్శవర్మ 99.27, ఏఎస్ఎస్.జశ్వంత్ 99.25, డి.నితిన్ 99.25 , యూసీహెచ్.చందన 99.20, కె.చంద్రశేఖర్ 99.19, వై.సాయి కౌశిక్ 99.07, పి.శ్రీనివాసు 99.02 పర్సంటైల్ సాధించినట్లు ఆయన తెలిపారు. 99 పర్సంటైల్ పైన 21 మంది, 98 పైన 41 మంది, 95 పైన 98 మంది, 90 పర్సంటైల్ పైన 205 మంది సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ అభినందించారు.

శ్రీప్రకాష్ ప్రతిభ



ఎన్.సూర్యచరణ్



ఎస్.అశోక్



జి.శిరీషా


తుని: జేఈఈ మెయిన్స్‌లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ వీవీఎస్ఎస్ భానుమూర్తి మంగళవారం తెలిపారు. శ్రీప్రకాష్ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్.సూర్యచరణ్ 99.69, ఎస్.అశోక్ 96.79, జి.శిరీషా 96.79 పర్సంటైల్ సాధించారన్నారు. కళాశాలలో మెయిన్స్‌కు కోసం ఇస్తున్న ఇంటిగ్రేటెడ్ కోచింగ్ ద్వారా విజయం సాధించి 10 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల వ్యవస్థాపకుడు సీహెచ్‌వీకే నరసింహారావు, కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

ఆరుగురికి కారుణ్య నియామక ఉత్తర్వులు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్యంలో పనిచేస్తూ మరణించిన ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇస్తూ ఉత్తర్వులను మంగళవారం జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ అందజేశారు. ఆరుగురికి అందుబాటులో ఉన్న వివిధ కార్యాలయాల్లోని ఖాళీల్లో సబార్డినేట్ పోస్టులను నియమిస్తూ ఉత్తర్వులు అందజేసినట్లు సీఈవో సత్యనారాయణ తెలిపారు. సీహెచ్ రవిశంకర్ (ఎంపీపీ, తుని), టి.మానస (ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్, కాకినాడ), జి. రత్నమాలతీ (ఎంపీపీ ఉప్పలగుప్తం) జి.గోవిందరాజు (ఎంపీపీ కాజులూరు), జి.జయసత్యశ్రీ (పీఐయూ డివిజన్, కాకినాడ), సీహెచ్ అనిత (ఎంపీపీ, రాజవొమ్మంగి)ను సబార్డినేట్ పోస్టుల్లో నియమించినట్లు వివరించారు. ఉప ముఖ్యకార్యనిర్వహణాధికారి ఎ.రమణారెడ్డి, ఏపీ పంచాయతీరాజ్ మంత్రిత్వ సిబ్బంది సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌వివి రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా భీమేశ్వరుని శ్రీ పుష్పోత్సవం

దంపత తాంబూలం అందుకున్న మంత్రి వేణు దంపతులు



ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబా అమ్మవారు



పుష్పోత్సవం సందర్భంగా తాంబూలం అందుకుంటున్న మంత్రి వేణు దంపతులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీ పుష్పోత్సవం వైభవంగా నిర్వహించారు. క్షేత్రంలో కల్యాణ మూర్తులైన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామివార్లకు ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య శాస్త్రోక్తంగా శ్రీ పుష్పోత్సవం నిర్వహించారు. పుణ్య దంపతులకు తాంబూలాలు అందజేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వరలక్ష్మి దంపతులు కార్యక్రమంలో పాల్గొని మొదటి దంపత తాంబూలం అందుకున్నారు. మండల ఉపాధ్యక్షురాలు సరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు నున్న సత్యవతి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ దంపతులు, భక్తులు పాల్గొన్నారు. మాణిక్యాంబా అమ్మవారి, భీమేశ్వరస్వామివారికి చేసిన అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

శ్రీ షిర్డీసాయి ముందంజ



జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనపర్చిన షిర్డీసాయి విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య మంగళవారం తెలిపారు. తమ లక్ష్యా ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందిన జీఎస్ ఆదిత్య, డి.జయప్రకాష్ 99.9 పర్సంటైల్ సాధించగా, సీహెచ్ మాన్విత 99.7, జైదీప్ శ్రీవాస్ 99.6, సీహెచ్ సాయిచరణ్ 99.3 పర్సంటైల్ సాధించి ప్రతిభ కనపరచారన్నారు. మొత్తం ఐదుగురు విద్యార్థులు 99 పైగా పర్సంటైల్ సాధించగా, 8 మంది 98కి పైగా, 17 మంది 97కు పైగా, 42 మంది 95కు పైగా పర్సంటైల్ సాధించారన్నారు. మొత్తం 207 మంది విద్యార్థులు హాజరుకాగా 153 మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. వీరిలో 109 మంది వివిధ ఎన్ఐటీలలో సీట్లు సాధించగలరని విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.